www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 20 డిసెంబర్ 2024



ఓపెన్ ఫోరం ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రుడా పరిధిలోని భవన నిర్మాణ, ల్యాండ్ డెవలప్‌మెంట్ కోసం అర్జీలు దాఖలు చేసినవారు, ప్రణాళికా విభాగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తగిన పత్రాలతో హాజరు కావలని రుడా వైస్ ఛాన్సలర్ కేతన గార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భవనం ప్లాన్, ల్యాండ్ అభివృద్ధికి చెందిన ఫైల్‌కు సంబంధించిన వివరాలతో ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రుడా కార్యాలయంలో 'ఓపెన్ ఫోరం కార్యక్రమానికి హాజరై, సందేహములు నివృత్తి చేసుకోవాలన్నారు. సత్వరం దరఖాస్తులను పరిష్కరించేందుకు కావాల్సిన సమాచారం తీసుకుని వస్తే దరఖాస్తును త్వరిత గతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

అర్ధాకలితో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేదన
- సమ్మె తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు అర్ధాకలితో బతుకీడుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాలలో 199 మంది కార్మికులు సేవలందిస్తున్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 2024 ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక హామీలు గుప్పించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఇంజినీరింగ్ విభాగం కార్మికులు ఏపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న సమ్మె చేపట్టారు. 10 రోజుల అనంతరం చర్చలకు పిలిచిన ఉన్నతాధికారులు నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో 19వ తేదీ నుంచి తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.



సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ చేపట్టిన కార్మికులు (ఫైల్ ఫోటో)

కార్మికుల సమ్మెపై ఉక్కుపాదం

కార్మికుల సమ్మెపై ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ నెల 9వ తేదీ తొలి రోజు మున్సిపల్ కార్యాలయం గేటు పక్కన కార్మికులు ఆందోళన చేశారు. పోలీసు అనుమతులు లేవని తేల్చిచెప్పటంతో తప్పనిసరి పరిస్థితులో ఎదురుగా గల అన్న క్యాంటీన్ వద్ద నిరసన తెలుపుతున్నారు. బరకాలతో టెంటు ఏర్పాటు చేసుకుని ఆందోళనలను కొనసాగించారు. అయితే సాయంత్రం 5 గంటల తర్వాత ఎవరూ ఉండకూడదని పోలీసులు హెచ్చరించడంతో టెంటును సైతం తొలగించడం పాలనా యంత్రాంగం తీరుకు దర్పణం పట్టింది. రాష్ట్ర స్థాయిలో ఉద్యమించడంతో ఉన్నతాధకారులు ఈ నెల 17న ఎట్టకేలకు అమరావతిలోని ఉన్నతాధికారులు చర్చలకు పిలవడంతో కార్మికులు తమ డిమాండ్‌లను విన్నవించారు. కార్మికుల డిమాండ్‌లను తెలుసుకన్న ఉన్నతాధికారులు నెల రోజుల వ్యవధి కావాలని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామనటంతో కార్మికులు సమ్మెను తాత్కాలిక వాయిదా వేశారు. అయితే నెల రోజులలో పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామంటూ స్పష్టం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 199 మంది కార్మికులు

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో 180 మంది, కొవ్వూరు మున్సిపాలిటీలో 13 మంది, నిడదవోలు మున్సిపాలిటీలో ఆరుగురు చొప్పున ఇంజినీరింగ్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరంతా కార్పొరేషన్, మున్సిపాలిటీలలో వీధిలైట్లు, తాగునీటి కుళాయిలు, పార్కులలో విధులు నిర్వహిస్తారు. చెత్త ట్రాక్టర్లు, లారీలు నడిపే డ్రైవర్లుగ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిట్టర్‌లుగా పని చేస్తున్నారు. గత 20 ఏళ్ల సర్వీసు ఉన్న వారికి సైతం ప్రభుత్వం నెలకు కేవలం రూ.15 వేల నుంచి రూ.18 వేల చొప్పున వేతనం చెల్లిస్తోంది. టెక్నికల్ వర్కర్లకు రూ.29,200, నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అక్కడి జీవన ప్రమాణాలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. 15 ఏళ్ల పైబడి పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు హెచ్‌ఆర్ పాలసీలు అమలు చేయాలని, శరీరం సహకరించని వారికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం తరుపున వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యం, అనారోగ్య శాతాన్ని నిర్ధయించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు.



15 ఏళ్ల సర్వీసు వారిని పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్పొరేషన్‌లో 20 ఏళ్లుగా తాగునీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నాను. ప్రభుత్వం కేవలం రూ.13,885 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నాము. తొలుత టెంట్లు తొలగించారు. ప్రస్తుతం 5 గంటల తర్వాత ఆందోళనలు చేయకూడదని చెబుతున్నారు. ఇది సరైంది కాదు. పాలకులు సానుకూలంగాఆలోచించాలి.

- బి.భవాని కుమార్, మున్సిపల్ కార్మికుడు, రాజమహేంద్రవరం.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గత 30 ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరా విభాగంలో విధులు నిర్వహిస్తున్నాను. వేతనం కేవలం రూ.16,000 మాత్రమే చెల్లిస్తున్నారు. ఒక వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పర్మినెంట్ చేసి ఉంటే కనీసం రూ.80,000 వేలు వేతనం వచ్చే అవకాశం ఉంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

- కె.ముకుందరావు, మున్సిపల్ కార్మికుడు, రాజమహేంద్రవరం.



మహా సభల లోగో ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరంలో డిసెంబర్ 28, 29న నిర్వహించే సిపిఎం 24వ జిల్లా మహాసభల లోగోను పార్టీ జిల్లా నాయకత్వం గురువారం ఆవిష్కరించింది. స్థానిక శ్యామల సెంటర్ వద్ద పార్టీ కార్యాలయంలో లోగోను ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ డిసెంబర్ 28న ప్రజా ప్రదర్శన మధ్యాహ్నం 2 గంటలకు మునిసిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభ మధ్యాహ్నం 3 గంటలకు కోటిపల్లి బస్‌స్టాండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబర్ 29న జరిగే ప్రతినిధుల సభకు జిల్లాలో ప్రతినిధుల సభకు హాజరవుతారని తెలిపారు. గత మూడేళ్లలో నిర్వహించిన ప్రజా పోరాటాలను సమీక్షించేందుకు ఈ మహాసభలో చర్చలు జరుగుతాయని తెలిపారు. ప్రజల సమస్యలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మహా సభల నిర్వహణకు నగర ప్రజానీకం, సిపిఎం అభిమానులు, వామపక్ష శ్రేయోభిలాషులు సహకారం అందించి విజయవంతం చెయ్యాలని కోరారు.

రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కోరుకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజల సమస్యలకి పరిష్కారం లభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం రాఘవపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి జనవరి 8 వరకూ గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆయా గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించే సమయంలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన భూ సంబంధ రికార్డులను అందుబాటులో ఉంచి, అర్జీదారులకు సంతృప్తి చెందేలా వివరాలు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి 1,235 అర్జీలు స్వీకరించి వాటిలో 183 పరిష్కరించినట్లు తెలిపారు. అర్జీలు పరిష్కార విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. 12 అర్జీలు అందాయని తహాశీల్దారు సుస్వాగతం తెలిపారు.



సదస్సులో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నన్నయలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీలను యూనివర్సిటీ క్యాంపస్‌లో విసి వై.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది ఇష్టపడే క్రీడ క్రికెట్ అని, ఢిల్లీ నుంచి గల్లీ దాకా క్రికెట్‌ను ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తున్నారని తెలిపారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ ఎంపిక అయిన జట్టు జనవరిలో చెన్నైలోని మెద్రాస్ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత పురుషుల క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఇడి కళాశాల ప్రిన్సిపల్ కె.సుబ్బారావు, డిఆర్ లింగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బివిఎం.ఫణీంద్ర, సిహెచ్.సుబ్రహ్మణ్యం, కోచ్‌లు డేవిడ్, ఎంవిఎస్‌ఎస్‌ఎన్.మూర్తి, కె.బాలసత్యనారాయణ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విసి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డిఇఒ

'పది'లో నూరు శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-కడియం

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని డిఇఒ కె.వాసుదేవరావు సూచించారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ వెనుకబడిన విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీమెటీరియల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ మెటీరియల్ జిల్లా అంతా పంపిణీ చేస్తామని డిఇఒ పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లులో శుక్రవారం, శనివారం 33/11 కెవి చాగల్లు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారి సుంకర త్రిమూర్తులు తెలిపారు. అన్ని 11 కెవి.ఫీడర్స్‌కు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీని వల్ల చాగల్లు, నెలటూర్, మీనానగరం గ్రామాలు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, నెలటూరు వ్యవసాయ ఫీడర్, అమ్మిగుంట ఫీడర్, ఉన్నగట్ల ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

'ప్రశాసన్ గావ్‌కి ఒరే' వారోత్సవాలపై శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

'ప్రశాసన్ గావ్ కి ఒరే' సుపరిపాలనపై కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో గురువారం వెబ్ కాస్టింగ్ ద్వారా శిక్షణ నిర్వహించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి.వీణాదేవి, స్లివా రెడ్డి, పిజిఆర్‌ఎస్ డిప్యూటీ తహశీల్దారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధత కలిగిన పనితీరు చూపడం ముఖ్యం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారం, పౌరులకు మెరుగైన సుపరిపాలన అందించే క్రమంలో ఐదేళ్లుగా 2019-24లో 'ప్రశాసన్ గావ్‌కి ఒరే' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తూ, జవాబుదారీతనం ఉండేలా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. మరింతగా ప్రచార కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సిఫార్సు చేసినట్టు తెలిపారు. డిసెంబరు 19 నుంచి డిసెంబర్ 24 వరకూ ప్రశాసన్ గావ్ ఒరే క్యాంపెయిన్, గుడ్ గవర్నెన్స్ వీక్ నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులతో, మండల స్థాయి వరకు పని చేసి, సుపరిపాలన నమూనాను ముందుకు తీసుకెళ్లడంలో విజయం సాధించిన మొత్తం ప్రభుత్వ విధానాన్ని ప్రజలకు చేరువ చేసి మెరుగైన సేవలు అందించాలని కలెక్టరు ప్రశాంతి పేర్కొన్నారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యదర్శి వి.శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి సంతా చౌహాన్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులూ, కలెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో విద్వేష అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత పార్లమెంటరీ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి మూలస్తంభం అయిన డాక్టర్ అంబేద్కర్ అంటే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు ఎంత ద్వేషం ఉందో అమిత్ షా వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు. ఈ శక్తులకు రాజ్యాంగం అన్నా అంబేద్కర్ అన్నా ద్వేషం అని రాజ్యాంగం బదులు మనుస్మృతి పాలన కోసం రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. దేవుని నామం స్మరించుకోవటం వల్ల ఎవరికి ఏం జరిగిందో తెలియదు గానీ అంబేద్కర్ వల్ల మోడీషాలు పార్లమెంట్‌లో మాట్లాడగలుగుతున్నారని గుర్తు చేశారు. కోట్లాది నిమ్న జాతుల ప్రజల ఆత్మ గౌరవానికి అంబేద్కర్ ప్రతిబింబం అని, అంబేద్కర్‌ను అవమానించిన షా తగిన మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జువ్వల రాంబాబు, బి.పవన్, ఎస్‌ఎస్.మూర్తి, పార్టీ నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ, వి.రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై గురువారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టికె.విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, పట్నాల శ్రీనివాస్, పిసిసి సభ్యులు అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడియార్, తడాల కొండరాజు, బిల్డర్ బాబి, ప్రభాకర్ చౌదరి, దొంతుమల్ల రామ్‌కుమార్, శాఖ పుల్లారావు, దెయ్యాల రాజు, జాల నటరాజ్, పిఎస్‌ఎన్ రాజు, మహమ్మద్ అలీ, షేక్ జయలలిత పాల్గొన్నారు.

అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని స్వతంత్ర జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రె ఆనంద్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమిత్‌షాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని, రాజ్యాంగాన్ని అమలు చేయవలసిన చట్ట సభలో రాజ్యాంగ నిర్మాతను, దేశ భవిష్యత్ ప్రదతను అవమానించిన కేంద్రమంత్రి అమిత్ షాను చట్టసభ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెపికి మాతృ సంస్థలైన జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం ఆవిర్భవించినప్పటి నుంచి, రాజ్యాంగంపైన, రాజ్యాంగ నిర్మాతపైన వ్యతిరేక తీర్మానాలు, ప్రకటనలు చేస్తూనే ఉన్నారన్నారు.



నిడదవోలులో అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు


గోకవరం అమిత్‌షా వ్యాఖ్యలు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ పరిధిలోనికి కచ్చితంగా వస్తాయని ప్రముఖ న్యాయవాది గుల్లా ఏడుకొండలు అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను దేశమంతా ఖండించాలన్నారు. అమిత్ షా ఉన్నతమైన కేంద్ర హోమ్ మంత్రి పదవికి ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

నిడదవోలు అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను నిడదవోలు చర్చిపేట సెంటర్‌లో గురువారం దహనం చేశారు. అమిత్‌షా చిత్రంపై చెప్పులతో కొడుతూ రాజీనామా చేయాలని నినదించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా సమాజంలో నిమ్న జాతుల ప్రజలకు గౌరవ స్థానం కల్పించిన మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. దేశానికి రాజ్యాంగా ద్వారా దిశానిర్దేశం చేసిన అంబేద్కర్‌ను అవమానించడం దుర్మార్గమన్నారు. ప్రతి భారతీయుడికి అంబేద్కర్ ఆరాధ్యుడు అన్నారు. మను ధర్మ శాస్త్రం అమలు చేయాలని చూస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు దేశప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మోషే, రమేష్, శేఖర్, పెద్దిరాజు, రాజేష్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

20న జిజియులో వ్యవసాయ సదస్సు

ప్రజాశక్తి-రాజానగరం

గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి రెండు రోజులపాటు వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిజియు విసి డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. భారతదేశంలో అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వారిలో దాదాపు 88 శాతం సన్న చిన్న కారు రైతులేనని చెప్పారు. సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఎంతో మేలు చేయవచ్చని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎన్నో వినూత్న పద్ధతులను ఆచరించి వ్యవసాయ పరిశ్రమను అభివృద్ధిని మరింత శక్తివంతం చేసే ఉద్దేశంతో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ఈ వ్యవసాయ ఆవిష్కరణ సదస్సును నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ పరిశోధకులు, ఇంకుబేటర్లు, వ్యవసాయ ఉద్యాన ఆక్వా కల్చర్ శాస్త్రవేత్తలు, ఎన్‌జిఒలు నాబార్డ్ అధికారులు వ్యవసాయ పరిశ్రమదార్లు, రైతులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జిజియు రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రావు, వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బివివి.బలరామ్, భగత్ తదితరులు పాల్గొన్నారు.



వాయు కాలుష్య నివారణకు ప్రణాళిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వాయు కాలుష్యంపై జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం, కాలుష్య నియంత్రణ మండలి, ఆర్‌ఎంసి, రవాణా, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాయు కాలుష్యాన్ని సమర్థవంతంగా నివారించడంలో ఉత్తమమైన పద్ధతులను అమలు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో అందజేసే నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో పెట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాయు కాలుష్యం తెలుసుకునేందుకు చేపడుతున్న చర్యలపై కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఇథనాల్ తదితర పరిశ్రమలకు వ్యవసాయ వ్యర్థాల సరఫరా విధానంపై అధ్యయనం చెయ్యాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పరిధిలో వస్తున్న చెత్త నుంచి ఆదాయం సృష్టించి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.. ఇందు కోసం కేంద్రం ద్వారా వస్తున్న నిధులను ఇతర శాఖలకు బదలాయింపు ప్రక్రియ, వాయు కాలుష్యము నివారణా మార్గాల కోసం సంస్థాగత నిర్మాణం కోసం అనుబంధ శాఖల సమన్వయంతో మాత్రమే సాధ్యం అవుతుందని కలెక్టర్ తెలిపారు. కాలుష్యనియంత్రణ అధికారులు వివరాలు తెలియజేస్తూ, వాయు కాలుష్యం కార్బన్ ఉద్గారాల పరిణామం ఏటా కనీసం రెండు శాతం తగ్గాలని, అందుకు అనుగుణంగా కేంద్రం ఇచ్చే గ్రాంటు పెంచే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ఎం.శంకరరావు, ఎ.కోమలి, జి.పాండురంగారావు, ఎస్.మాధవరావు, ఆర్.సురేష్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి




విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఒలింపియాడ్‌లో శ్రీమహతి విజయభేరి

ప్రజాశక్తి - సీతానగరం

అత్యంత ప్రతిష్టాత్మక ప్రతిభా పరీక్ష ఇంటర్ నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలో తమ విద్యార్థులు రీజినల్, జోనల్ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించారని కాటవరం శ్రీమహతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన ఇంగ్లీష్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలో శ్రీమహతి స్కూల్ విద్యార్థులు 1వ తరగతి నుండి 10వతరగతి వరకూ మొత్తం రీజినల్, జోనల్ పరిధిలో 46 గోల్డ్ మెడల్స్ సాధించారు. 40 మంది విద్యార్థులు లెవెల్ -2కి ఎంపియ్యారు. ఆరుగురు గిఫ్ట్, కేష్ ప్రైజస్ పొందారని, ఇంటర్ నేషనల్ బెస్ట్ 4వ ర్యాంకును ఆరుగురు విద్యార్థులు సాదించారని ఐఐటి. అకడమిక్ డైరెక్టర్ ఎ.రాంప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను మేనేజ్‌మెంట్ అభినందించింది



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు

డిఆర్‌పిలకు శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక నన్నయ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి రిసోర్స్ పెర్సన్స్‌కు మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులను గురువారం డిఇఒ వాసుదేవరావు ప్రారంభించారు. 21వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, సిడిపిఒ డి.మమ్మీ, ఎసిడిపిఒలు కనకవల్లి, వరలక్ష్మి, లెక్చరర్ డిఎన్‌వి.సత్యనారాయణ, ఎ.కన్నయ్య నాయుడు, వి.త్రివేణి, చంద్రశేఖర్, హెచ్‌ఎం బివి.ఆనంద్, జయంతి శాస్త్రి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మనస్థాపానికి గురై విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రమణక్కపేటలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు ప్రకారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిని చదువుపై దృష్టి పెట్టాలని తల్లి మందలించింది. దీంతో ఆ విద్యార్థిని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను వైద్యం కోసం కాకినాడ తరలించినట్లు స్థానికులు తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తూర్పుపాకలు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగిని వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని తాటిపర్తి గ్రామం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన రౌతు నరసయ్య (33) తన భార్యతో తగాదా పడి తన వ్యవసాయ పొలంలో ఈ నెల 18వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో తన కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతని ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

శ్రీరాంపురం రహదారిలో గురువారం రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై బొమ్మూరు ఎస్ఐ ప్రియ కుమార్ తెలిపిన వివరాలివి. చుక్కా శ్రీను (38) శ్రీరాంపురం అత్తారింటికి వెళుతుండగా దివాన్ చెరువు సెంటర్లో బివిసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి లిఫ్ట్ అడిగి బైకు ఎక్కాడు. చైతన్య టెక్నో స్కూల్ సమీపంలో బైకు అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. శ్రీను తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ఇంజనీరింగ్ విద్యార్థిని రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్యాంకర్ నుంచి యాసిడ్ లీక్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రి సమీపంలో ట్యాంకర్ లారీ యాసిడ్ లీకై ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి దేవరపల్లి యాసిడ్ లోడ్‌తో లారీ వెళుతుండగా మెడికల్ కళాశాల సమీపంలో రెండు చోట్ల లీకైంది. దీంతో యాసిడ్ ట్యాంక్ నుండి రహదారిపై పొగలు విరజిమ్మితూ కారిపోయింది. రహదారిపై ప్రయాణిస్తున్న వారికి కొద్దిగా కళ్లు మంటలు దురదలు వచ్చాయి. రాజమహేంద్రవరం, కోరుకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ట్యాకంర్ నుండి లీక్ అవుతున్న రెండు ప్రదేశాల యాసిడ్ సాంద్రతను నీళ్లతో తగ్గించుకుంటూ సమీపంలో రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ లోకి పంపారు.

ధాన్యం డబ్బుల కోసం ఫిర్యాదు


ప్రజాశక్తి - సీతానగరం

ధాన్యం కొనుగోలు చేసిన ఏజెంట్ డబ్బులు ఇవ్వకపోవడంతో గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన రైతులు పెండ్యాల అవిస్వామి, దాసరి వీరాస్వామి ఫిర్యాదు చేశారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన దుద్దిపూడి సూరిబాబు ధాన్యం కొనుగోలు ఏజెంట్. ఆయన అవిస్వామి వద్ద రూ.68 లక్షల మొక్కజొన్న ధాన్యం తీసుకుని రూ.45 లక్షలకు రెండు చిక్కులు ఇచ్చాడు. ఇంకా రూ.23 లక్షలు ఇవ్వాల్సి ఉంది. వీరాస్వామి వద్ద ధాన్యం కొనుగోలు చేసిన రూ.21 లక్షల సొమ్ములు ఇవ్వలేదు. దీంతో డబ్బులు ఇవ్వాలని రైతులు అడిగారు. డబ్బులు ఇవ్వకపోగా సూరిబాబు బెదిస్తున్నాడని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకుల చోరీపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - సీతానగరం

బైకులు చోరీకి గురైనట్లు ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన కుప్పల యేసుబాబు, చింతా సత్యనారాయణ గురువారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యేసుబాబు, సత్యనారాయణకు చెందిన బైకులను ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఫిర్యాదు చేశారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వెటర్నరీ అధికారి

పశు వైద్య సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-కడియం

ప్రాంతీయ పశు వైద్యాశాలలో పశు వైద్య సిబ్బందితో గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ టి.శ్రీనివాస రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పచ్చి గడ్డి పెంపకం, 21వ జాతీయ పశుగణన, మినీ గోకులాల నూతన నిర్మాణాలు తదితర అంశాలపై వివరిస్తూ సమీక్ష నిర్వహించారు. స్థానిక పశు వైద్యశాలకు ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయి మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సమీక్షలో ఉప సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు, కడియం పశు వైద్యాధికారి డాక్టర్ జి.రవివర్మ, రాజవోలు, జేగురుపాడు, తొర్రేడు పశు వైద్యులు డాక్టర్ వెంకట రావు, డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత ప్రణయ్

ప్రజాశక్తి-నల్లజర్ల



ప్రణయ్‌ను అభినందిస్తున్న వసుంధర

నల్లజర్లలోని ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ కాలేజిలో ఇంటర్ సిఇసి మొదటి సంవత్సరం విద్యార్థి దేవరపల్లి మండలం రామన్నపాలెంకు చెందిన జొన్నకూటి ప్రణయ్ బాస్కెట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. అనపర్తిలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ కళాశాల చైర్మన్ కంటమని వసుంధరా దేవి విద్యార్థిని అభినందించారు.

రోడ్డు పనుల వేగవంతంపై హర్షం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం



కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

మండలంలోని చివటం గ్రామ ప్రజల చిరకాల కోరిక, గ్రామ ప్రధాన రహదారి సిసి రోడ్డు, నిర్మాణ పనులు వేగవంతం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ నుంచి మోర్త డ్రైయిన్ వరకూ సుమారు కిలోమీటర్ పొడవు, 18 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న సిసి రోడ్ నిర్మాణం మొదట ప్రారంభించి వదిలేయడంతో గ్రామస్తుల్లో అనుమానం వ్యక్తం అయింది. మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు చొరవతో మంత్రి కందుల దుర్గేష్ నిర్ణయంతో సోమవారం నిర్మాణ పనులు ప్రారంభించడంతో పనులు వేగవంతం అయ్యాయి.



ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉద్యోగులు బదిలీపై ఎక్కడికి వెళ్లినా విధి నిర్వహణలో ఆ ప్రాంత ప్రజల మనసులు చూరగొనాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు అన్నారు. ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుళ్లు కొవ్వూరు, తాళ్లపూడి, పెరవలి, ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన వారికి, బదిలీలపై ఉండ్రాజవరం స్టేషన్‌కు వచ్చిన ఉద్యోగులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వై.నాగేశ్వరరావు, కె.రమేష్, ఆర్‌కె.సత్యనారాయణ, ఎం.ముత్యాలరావు, కె.జయరామ్, కె.గంగాధరరావు, వై.రాజు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో భూముల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను బాధితుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, టిడిపి నాయకులు నాదెల శ్రీరామ్ చౌదరి, ఆళ్ల హరిబాబు, కరటూరి సతీష్, కేతా సాహెబ్, ఎన్‌డిఎ కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మత్తులు చేపట్టనున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలోని కోరుకొండ మండలంలోని పశ్చిమగానుగూడెం, జంబూపట్నం, నరసాపురం, గాదరాడ, కణుపూరు, రాజవరం, కోరుకొండ, కాపవరం, మునగాల, శ్రీరంగపట్నం, రాఘవపురం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, అచ్చియపాలెం, గరగలంపాలెం, కోటి గ్రామాలకు గోకవరం మండలంలోని గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, వెదురుపాక, బావాజీపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

పిఎంపి వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కోరుకొండ

పిఎంపి అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిఎంపి రాష్ట్ర ఉపాధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం గురువారం కోరుకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక దినోత్సవం రాష్ట్ర నలుమూలలా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంబాబు, జిల్లా అధ్యక్షులు బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కోరుకొండ అధ్యక్షులు కె.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా జట్టుకు ఆదిత్య విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఎఐఎంఎల్ విభాగానికి చెందిన విద్యార్థి జెఎన్‌టియుకె యోగ మెన్ టీంకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ఒడిసా రాష్ట్రంలోని కెఐఐఎస్ యూనివర్శిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జెఎన్‌టియుకె యోగ మెన్ టీంలో తమ విద్యార్థి కె.గణేష్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్య సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి యోగ మెన్ టీంకు ఎంపికైన గణేష్‌ను అభినందించి రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్స్, అన్ని విభాగాల అధిపతులు, ఫిజికల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రతి రైతు పంటల బీమాను సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా పొందాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రమణయ్యపేట గ్రామంలో పంటల బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి రైతు ఎకరానికి రూ.630 ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించాలన్నారు. అపరాల రైతులు ఎకరాకు రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు.

హైవేలు, రైల్వే, విమానాశ్రయ అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

హైవేలు, రైల్వే, విమానాశ్రయాల భూసేకరణ, తదితర అంశాలపై విమానయాన, ఎన్‌హెచ్, రైల్వే అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రాజెక్టుల వారీగా గురువారం సమీక్షించారు. జాతీయ రహదారులు, రైల్వేలకు చెందిన 13 అంశాల ప్రగతి వివరాలను సమీక్షించారు. రెండు రోజుల క్రితం పోలవరం ప్రాజెక్ట్ సందర్శన సమయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి అనుసంధానంగా జాతీయ రహదారి మార్గం విషయమై దిశా నిర్దేశం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి-పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తున్న జాతీయ రహదారి మార్గంలో భూసేకరణపై సమగ్ర వివరాలు అందచేయాలని పేర్కొన్నారు. పట్టిసీమ నుంచి పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి రహదారి మార్గం కలపడంతో పాటు, పట్టిసీమ నుంచి కొవ్వూరుకు ప్రతిపాదించిన జాతీయ రహదారి మార్గంపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఎన్‌హెచ్ పీడీ సురేంద్ర బాబు, రైల్వే ఇఇకె కె.అశోక్ కుమార్, రైల్వే ఎస్ఎస్ఇ జి.శ్రీనివాస రావు, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎస్‌బివి.రెడ్డి, కొవ్వూరు ఇఇ రూప్ కుమార్, కలెక్టరేట్ ఎఒ ఎండీ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా కరపత్రాల విడుదల

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో భాగంగా రబీ పంటకు సంబంధించి గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించడం ఈ పథకపు ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. జిల్లాలో వరి, మొక్కజొన్న పంటలకు ఈ బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ బీమా ప్రీమియం డిసెంబర్ 31వ తేదీలోగా చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణం తీసుకునే రైతులు సంబంధిత బ్యాంకుల ద్వారా ప్రీమియం నేరుగా బీమా కంపెనీకి చెల్లిస్తారని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు ఆర్థిక సాయంతో రూ.15 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఇఒ సిహెచ్.సక్సేనారాజు తొలుత స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు మాట్లాడుతూ ఏటా 10వ తరగతి, ఎన్‌ఎంఎంఎస్, 8వ, తరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రాంబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు వైవి.స్వామి, మండల అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.తాతారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి రామారావు, కుటుంబ సంక్షేమ పథక డైరెక్టర్ ఆర్ఎస్ఆర్ ఫణి, జిల్లా కౌన్సిలర్ పి.వీరాంజనేయులు, మండల కార్యదర్శి ఎ.రత్నాకర్ చౌదరి, మహిళా కార్యకర్త జి.కనకదుర్గ, సీనియర్ ఉపాధ్యాయులు నిరీక్షణ రాజు, లక్ష్మీ నారాయణ, ఉదయ్ భాస్కర్, దుర్గా ప్రసాద్, శేషేంద్ర పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు పలువురి వినతులు

ప్రజాశక్తి - సామర్లకోట, కరప

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి పూర్తి వ్యతిరేకంగా ఉందని దళిత యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నతేల హరిబాబు అన్నారు. గురువారం వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నయమించిన ఏకసభ్య కమిషన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సిసామాజిక వర్గంలోని అన్ని ఉపకులాలకు పెద్దఎత్తున నష్టం కలిగించడం జరుగుతుందని, అణగారిన కులాలు ఎస్‌సి వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకించడం, తిరస్కరించడం జరుగుతుందన్నారు. అలాగే ఎస్‌సి వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని ఏకసభ్య కమి షన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే వర్గీకరణ చేపట్టి తమకు న్యాయం చెయ్యాలని కోరారు. నందిక చక్రం, మందపల్లి వెంకన్న, మల్లెల మహేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో 4,500 మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రక్కిలంక భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం 4500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సొలస కాశీ విశ్వనాథం, కార్యదర్శి సొలస గిరిధర్ గాంధీ మాట్లాడారు. ఆలయం వద్ద 23 ఏళ్లుగా ఉత్సవాలు, పర్వదినాలతో పాటు ప్రతి మంగళవారం దాతల సాయంతో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

గైట్ డిగ్రీ కళాశాలలో వర్క్ షాప్

ప్రజాశక్తి-రాజానగరం

గైట్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయులకు సమగ్ర విద్య అనే అంశంపై గురువారం వర్క్ షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వల్లి మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరబిందో యాక్షన్ విద్యా సంస్కృతి కన్సల్టెంట్ సి.లక్ష్మీ జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అరబిందో సొసైటీ భారతశక్తి డైరెక్టర్ డాక్టర్ బిలో మెహ్రా మాట్లాడుతూ వివిధ కృత్యాల ద్వారా సమగ్ర విద్యను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బిఎస్.విభాగాధిపతి డాక్టర్ సావిత్రి, అధ్యాపకులు ఎ.మాధవి కామేశ్వరి పాల్గొన్నారు.

ఎస్‌సిలను వర్గీకరించే అధికారం లేదు

ప్రజాశక్తి-కడియం

భారత రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం ఎస్‌సిలను వర్గీకరించే అధికారం లేదని మండలంలోని పొట్టిలంక అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నక్కా వెంకటరత్నరాజు, కార్యదర్శి నక్కా చంటిబాబు అన్నారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ విచారణ అధికారికి కాకినాడలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిలో మాలలు సుమారుగా 80 లక్షల పైబడి ఉన్నందున అత్యధిక జనాభా కలిగిన మాలల మనోభావాలను, వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారి విధానాలను పరిగణలోకి తీసుకుని ఎస్‌సి వర్గీకరణ చేయకూడదని అభ్యర్థిస్తున్నట్టు తెలిపారు.

అబ్బులు మృతి తీరని లోటు

గండేపల్లి : ఉప్పలపాడుకు చెందిన జనసేనపార్టీ నాయకులు మేడిబోయిన శ్రీను తండ్రి, సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిపోయిన అబ్బులు మతి తీరనిలోటని జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. గురు వారం శ్రీను, రామకృష్ణ కుటుంబాన్ని పరా మర్శించి ఆయన పరామర్శించారు.పరామర్శించిన వారిలో సత్యదేవ నర్సరీ అధి నేతలు పుల్లా పెద సత్యనారాయణ, చిన్న సత్య నారాయణ, ఎజిపి.రమాకాంత్‌రెడ్డి, రామ కుర్తి మూర్తి,పేపకాయల రాంబాబు, సింగులూరి రామ్ దీపు, ఉలిసి ఐరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

కుమార రామ భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కు సామర్లకోటకు చెందిన గుండపు సత్యవతి తన మనవడు గుండపు ప్రదీప్‌కుమార్ పేరున రూ.లక్ష విరాళం అందజేశారు. గురు వారం ఆలయంలో చెక్కు రూపంలో ఆలయ అధి . కారులకు ఆమె విరాళాన్ని అందజేశారు. వారికి ఇఒ బళ్ళ నీలకంఠం స్వామి వారి చిత్ర పటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

పలువురు ఎపిఒలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

డ్వామా క్షేత్ర స్థాయి అధికారుల పని తీరుపై కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద డిసెంబర్ నెలాఖరు నాటికి జిల్లాకి కేటాయించిన 44 లక్షల పని దినాలు లక్ష్యంలో ఇప్పటి వరకూ 42 లక్షల 90 వేలు పూర్తి చేశారని, ఈనెలాఖరు నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సగటు వేతనం రూ.256 లుగా చెల్లిస్తున్నామని, ఈ మొత్తం 300 రూపాయల వరకు చేరేలా పనుల గుర్తింపు ఉండాలన్నారు. రంగంపేట, సీతానగరం ఎపిఒలు లక్ష్యాలు సాధించక పోవడంపై వివరణ కోరారు. పనితీరు మెరుగు పరుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రంగంపేట, కోరుకొండ, నల్లజర్ల ఎపిఒలకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ రహదారి పనులు నూరుశాతం జనవరి 12 కల్లా పూర్తి చెయ్యాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వర రావు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు తుమ్మలపల్లి పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల అనారోగ్యంతో మరణించిన పలువురి కుటుంబాలను గురువారం జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. శివరామపట్నంలో గాబు శివరామకృష్ణ కుమార్తె ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను, కామరాజుపేటలో జనసేన పార్టీ నాయకుడు రాజమండ్రపు సత్తిబాబు తండ్రి రాజమండ్రపు శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గుల్లంపూడి నాగేశ్వరరావు, రాజమండ్రపు పెద్ద, కంటే సత్తిబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

NOTICE OF THE DAY FIXED POR SETTLING A SALE PROCLAMATION

ORDER 21 BUAR SE SPC NOTICE

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE RAMACHANDRAPURAM

E.P. No. 103 /2019, O.SNO.92/2017

Between:-

NEMANI J.J.RAM PRASAD ...**Decree Holder**

And

BILLAKURTHI SESHA RATNAM AND ANOTHER ..**Judgement debtor**

2. KOTA VIJAYALAKSHMI WIFE OF PRASAD, AGE: 41 YRS, C/O, YENDAMURI DHANA LAKSHMI, HOUSE WIFE, PANINGIPALLI, K. GANGAVARAM MANDAL, RAMACHANDRAPURAM ICIC LIMITS

HEARING DATE

Where as in the above named suit O.S.NO.92/2017 of principal junior civil judge court, Ramachandrapuram, the Decree Holder, has applied for the sale of schedule property In the above E.P that the the day day of **30-12-2024,** has been fixed for settling the terms of the proclamation of Sale and you are here by directed to furnish the value of the property and also posted for your appearance. Os that you have to appear in person or through an Advocate at 10-30 A.M. before the Court reformed above. Otherwise, the above case will be decide exparte

(BY ORDER OF THE COURT)

TANTRAVAHI SUBBA RAO BSCBL

R.V.G.SUBBA RAO BSCBL (Mani Babu) bschl

ADVOCATES FOR PLAINTIFF,

Dt:14-12-2024 Ramachandrapuram

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం. 12285/2002-ఎ16 తేది. 19-12-2024

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు (జాబితాలో 8వ కాలము నందు చూపబడిన రిజర్వుడు కేటగిరి షాపులు మినహాయించి) స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 3 సంవత్సరముల కాలం నెలసరి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్త హక్కును వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది.04-01-2025 తేదీ నుండి ది. 09-01-2025 తేది వరకు నిర్వహించబడును.

వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమీషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఆఫీసులో ది.03-01-2025 వ తేది మధ్యాహ్నం గం.1:00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరించబడవు. ఒక్కొక్క షాపునకు విడివిడిగా ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరిచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు వుండరాదు.

వేలములో ఖాయపరచిన అద్దెతో 3 నెలల అద్దె (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. వేలములో ఖాయపరచిన అద్దెపై 18% జి.ఎస్.టి. తో ప్రతి నెల 10వ తారీఖు లోగా కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 3 సంవత్సరములు, తదుపరి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువ సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై పొడిగించబడును. లీజుకాలము 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు అప్పగించవలెను. వేలం ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమీషనరు గారికి పూర్తి అధికారం కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. నగరపాలక సంస్థ కార్యాలయములో రెవెన్యూ విభాగము నందు ఎ16 గుమస్తా నుండి షాపులు, నెలవారీ అద్దె, చెల్లించవలసిన ధరావత్తు దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ, వేలం నిర్వహించుచున్న తేది మొదలగు వివరములను పొందగలరని తెలియచేయడమైనది.

సం/- **కమిషనరు,**

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

వాహనాల వేలం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ ప్రొబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 6 బైకులకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.24 వేలకు గాను వేలం ద్వారా రూ.49,900, జిఎస్‌టి ద్వారా రూ.8,148 వచ్చినట్టు సిఐ శ్రీనివాస్ బాలాజీ తెలిపారు ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కసిరెడ్డి అచ్యుతరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు గురువారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. రవిశంకర్ పట్నాయక్ మాట్లాడారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A.No.892/2024 in A.S.S.R.No.4846/2024

Between:-

Salumuri Simhachalam, W/o Satya narayana, Hindu, Aged 68 Years House Wife, Door No. 1-84, Pattipalern Tadepalligudem, TPGM JCJ

...**Appellant/Plaintiff**

And

Pasila Suri Venkat Appa Rao S/o Satyanarayana, Hindu, Aged 46 years. Property, Door No. 36-31-4, Innespeta, Ramalayam Street, Rajahmundry RJCJ.

...**Respondent/Defendant**

పై నంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు /డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.03-01-2025** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **G.శ్రీనివాసరావు**

19-12-2024 అడ్వకేట్, రాజమండ్రి

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATORAT KAKINADA

AACF NO. 21 OF 2022

Between:

M/s Shriram Chits Private Limited, Rajamahendravaram-I Branch, Rep by its Senior Manager cum G.P.A. Holder M.S.Sambasiva Rao, S/o. Satyanarayana Murthy (Late), Aged 42 Years, O/O.Zonal Office, Innespeta, Rajamahendravaram

...**Disputant**

And

1. Valiveti Ram Gopal, S/O.Venkateswarlu, Hindu, Aged 83 Yrs, Pension Holder., R/O. D.No. 11-6-29/2, Srinivasapuram, Kovvur, W.G.Dt.
2. Velama Veera Naga Babu, S/O. Rama Chandra Rao, Hindu, Aged 36 Yrs, KH Helper, Mechanical Dept., S.C.Railway, Rajamahendravaram, Emp No. 244IG131488., R/O.D.No. 7-14-3/1, Ullithota Street, Vasamsetti Vari Veedhi, Rajamahendravaram:

...**Opponents**

నోటీసు

పై నెంబరు డిస్ప్యూట్ నందు కంపెనీ వారికి రావలసిన బాకీ **రూ.16,408/-** కొరకు దావా దాఖలు చేసి యున్నారు. సదరు డిస్ప్యూట్ నందు అపొనెంట్స్ 1 మరియు 2 యొక్క హాజరు నిమిత్తం **ది.27-12-2024** వ తేదిన వాయిదా అయివున్నది. కావున **ది.27-12-2024**వ తేది ఉదయం **11.00 గం॥లకు** డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రారు ఆఫీసు, కాకినాడ వారి ఎదుట స్వయంగ గాని మీ ప్లీడరు గారి ద్వారా హాజరు కావలెను. లేని యెడల మీ యందు పరోక్షంగ విచారించి తీర్మానించబడును.

డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్

స్థలం: కాకినాడ కాకినాడ

12-12-2024

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AND ARBITRATORAT KAKINADA

AACF NO. 20 OF 2022

Between:

M/s Shriram Chits Private Limited, Rajamahendravaram-I Branch, Rep by its Senior Manager cum G.P.A. Holder M.S.Sambasiva Rao, S/o. Satyanarayana Murthy (Late), Aged 42 Years, O/O.Zonal Office, Innespeta, Rajamahendravaram

...**Disputant**

And

1. Midde Satti Babu, S/O. Narayana Murthy, Hindu, Aged 47 Yrs, Cars Sales & Purchase, J.N.Road, Rajamahendravaram., R/IO. D.No. 4-11, U.G.Palem, Vinayakagudi Daggara, Velicheru, Atreyapuram Mandal.
2. Jujjavarapu Sirisha, W/O. Venkata Ramesh, Hindu, Aged 41 Yrs, Sri Lalitha Finance Partner, Main Road, Rajamahendravaram., R/O.D.No. 78-11-3, Sri Gowthami School, Syamala Nagar, Gandhipuram-3, Rajamahendravaram.
3. Jujjavarapu Venkata Ramesh, S/O. Veerraju, S/O. Veerraju, Hindu, Aged 52 Yrs, Prop. Sri Lalitha Finance, Rajamahendravaram., R/0.78-11-3, Sri Gowthami School, Syamala Nagar, Gandhipuram-3, Rajamahendravaram

....**Opponents.**

నోటీసు

పై నెంబరు డిస్ప్యూట్ నందు కంపెనీ వారికి రావలసిన బాకీ **రూ.19,405/-** కొరకు దావా దాఖలు చేసి యున్నారు. సదరు డిస్ప్యూట్ నందు అపొనెంట్స్ 1 నుండి 3 యొక్క హాజరు నిమిత్తం **ది.27-12-2024** వ తేదిన వాయిదా అయివున్నది. కావున **ది.27-12-2024**వ తేది ఉదయం **11.00 గం॥లకు** డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రారు ఆఫీసు, కాకినాడ వారి ఎదుట స్వయంగ గాని మీ ప్లీడరు గారి ద్వారా హాజరు కావలెను. లేని యెడల మీ యందు పరోక్షంగ విచారించి తీర్మానించబడును.

డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్

స్థలం: కాకినాడ కాకినాడ

12-12-2024